క్లుప్తంగా

బైపాస్ రహదారిలో నిలిచిపోయిన ట్రాఫిక్



భవానీపురం(విజయవాడపశ్చిమ):గొల్లపూడి బైపాస్ రహదారిపై దాదాపు రెండు గంటల పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. గొల్లపూడి మైలురాయి సెంటర్ సమీపంలో పెద్ద గొయ్యి తీయడం, బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి అక్కడ నీళ్లు చేరటంతో నిత్యం రద్దీగా ఉండే బైపాస్ రహదారిలో రాకపోకలు సాగించే లారీలు, టిప్పర్లు, బస్సులు, కార్లు ఎక్కడికి అక్కడ నిలిచిపోయాయి. ఈ క్రమంలో స్కూల్స్ వదిలే సమయం కావడంతో స్కూల్ బస్‌లు కూడా ట్రాఫిక్‌లో చిక్కుకుని విద్యార్థులు నానా ఇబ్బందులు పడ్డారు. ప్రతి రోజూ సమయానికి వచ్చే పిల్లలు ఇంకా రాకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. గొల్లపూడి మైలురాయి సెంటర్ నుంచి హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్స్ గేట్ వరకు పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోవడంతో ద్విచక్రవాహనదారుల పరిస్థితి వర్ణనాతీతంగా మారింది. మైలురాయి సెంటర్‌లో బీటు నిర్వహించే పోలీసులు మినహా మరెవ్వరూ రాకపోవడంతో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చాలా సమయం పట్టింది.

చురుగ్గా ఎంప్లాయిస్ సంఘ్ ఎన్నికల ప్రచారం



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ):రైల్వే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల ప్రచారంలో భాగంగా దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ నేతలు చురుగ్గా ప్రచారంలో పాల్గొన్నారు. ఎంప్లాయిస్ సంగ్ డివిజన్ ప్రెసిడెంట్ ఆకుల రాఘవేంద్ర, నేతలతో కలసి వ్యాగన్ డిపో, ఆర్వోహెచ్ షెడ్ తదిత ప్రాంతాల్లోని కార్మికులను బుధవారం కలుసుకుని రైలు ఇంజిన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వే మెన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మర్రి రాఘవయ్య రైల్వే కార్మికులకు ఎనలేని సేవలు అందిస్తున్నారని.. కార్మికులకు మరిన్ని సేవలు అందించాలంటే రైలింజన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. జోన్ నుంచి డివిజన్ స్థాయి వరకు కార్మికుల సమస్యలు పరిష్కరిస్తూ కార్మికులకు అందుబాటులో ఉంటూ ఎంప్లాయిస్ సంగ్ ఎన్నో సేవలు చేసిందన్నారు. కార్మికుల హక్కులైన ఎనిమిదవ వేతన సంఘం, మహిళా కార్మికులకు వంద శాతం జీతంలో వెయ్యి రోజులు చైల్డ్ కేర్ లీవ్‌లు సాధించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ సంగ్ నేతలు కర్నూలు సుకుమార్, ఫణి రాజ్ కుమార్, హైమావతి, మణికుమార్, మునికృష్ణ ,సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

3న సమావేశాన్ని విజయవంతం చేద్దాం



లబ్బీపేట(విజయవాడతూర్పు): వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా కార్యకర్తలతో ఆత్మస్థైర్యాన్ని నింపేలా నవంబరు 3న విజయవాడలో నిర్వహించనున్న విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేద్దామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తూర్పు నియోజకవర్గంలోని పార్టీ కీలక నాయకులతో బుధవారం నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. పార్టీ కార్యకర్తల్లో జోష్ నింపేలా ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నాలుగు నెలల్లోనే ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేలా ప్రతి కార్యకర్త సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర సీనియర్ నాయకుడు కడియాల బుచ్చిబాబు, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ, కార్పొరేటర్లు, డివిజన్ ప్రెసిడెంట్‌లు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

మధురంగా సాగిన గాత్ర కచేరి



విజయవాడ కల్చరల్: స్వరఝరి సంగీత సాహిత్యసేవా సంస్థ ఆధ్వర్యంలో సంగీత మూర్తి త్రయంలో ఒకరైన ముత్తుస్వామి దీక్షితార్ వర్ధంతి సందర్భంగా గాంధీనగర్ సన్యాసిరావు వీధిలోని సంస్థ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సంగీతోత్సవం మధురంగా సాగింది. నగరానికి చెందిన యువ సంగీత కళాకారులతోపాటు, సీనియర్ విద్వాంసులు ముత్తుస్వామి దీక్షితార్ రచించిన కీర్తనలు మధురంగా ఆలపించారు. లంక తేజస్విని నిర్వహించిన కచేరి ఆకట్టుకుంది. పార్వతీ కుమారం, సత్యనారాయణం ఉపాస్మహే, గణేశాత్పూరం, అన్నపూర్ణే విశాలాక్షి, గురుగుహ తదితర కీర్తనలు ఆలపించారు. సంగీత విద్వాంసులు అంజనా సుధాకర్, వేమూరి విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

బెజవాడలో మార్కెట్లు కళకళ

- రద్దీగా దర్శనమిస్తున్న ప్రధాన కూడళ్లు
- ఆఫర్లతో దుకాణాల బాట పట్టిన నగర ప్రజానీకం
- దుకాణాల్లో పండుగ కళ
- నగరంలో వివిధ ప్రాంతాల్లో బాణసంచా విక్రయాలు



రాజీవ్‌గాంధీ పూల మార్కెట్ వద్ద వివిధ రకాల పూలను కొనుగోలు చేస్తున్న నగరవాసులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని బెజవాడ మార్కెట్లు కళకళలాడుతున్నాయి. చుట్టుపక్కల జిల్లాలకు కేంద్ర బిందువుగా ఉండే విజయవాడ మార్కెట్లన్నీ వినియోగదారులతో రద్దీగా దర్శనమిస్తున్నాయి. దీపావళి పర్వదినానికి అన్ని రకాల మార్కెట్లుకు చెందిన దుకాణాల్లో నగర వాసులే కాకుండా చుట్టుపక్కల జిల్లాలకు చెందిన ప్రజానీకం సైతం కొనుగోళ్లతో బిజీబిజీగా మారారు. పాతబస్తీ, శివాలయంవీధి, మొయిన్‌బజార్, బీసెంట్‌రోడ్డు, బందరురోడ్డు, ఏలూరు రోడ్డుతో పాటుగా అన్ని ప్రధాన కూడళ్లు రద్దీగా మారాయి. ముఖ్యంగా బుధవారం ఉదయం నుంచి మార్కెట్లు కిటకిటలాడుతున్నాయి.

భారీ ఆఫర్లతో....

భారీ ఆఫర్లతో నగరంలోని అన్ని దుకాణాలు కళకళలాడుతున్నాయి. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని దాదాపుగా అన్ని ప్రముఖ కంపెనీలు ఆఫర్లను ప్రకటించాయి. పండుగను పురస్కరించుకొని గృహోపకరణాలు, మొబైల్స్, ద్విచక్ర వాహనాలు తదితర రంగాలకు చెందిన కంపెనీలు, కార్పొరేట్ దుకాణాలకు చెందిన ప్రకటనలు గడిచిన వారం రోజులుగా వివిధ మాధ్యమాల్లో సందడి చేశాయి. దీంతో ఆయా దుకాణాల సముదాయాలు వినియోగదారులతో రద్దీగా దర్శనమిస్తున్నాయి. ఆఫర్లతో పాటుగా ఈఎంఐలకు అందించే సంస్థలు సైతం ఆయా దుకాణాల్లో బిజీబిజీగా కనిపించారు. నగరంలోని బందరురోడ్డు, రింగ్‌రోడ్డు, ఏలూరురోడ్డుతో పాటుగా నగర శివారు ప్రాంతాల్లో ఉన్న దుకాణ సముదాయాలు సైతం బిజీబిజీగా మారాయి.

బంగారం దుకాణాల్లోనూ సందడి....

ధనత్రయోదశి ఘడియలు బుధవారం మధ్యాహ్నం వరకూ ఉండటంతో నగరంలోని బంగారం దుకాణాలు సైతం సందడిగా కనిపించాయి. ఏడాదిలో అక్షయ తృతీయ, ధనత్రయోదశి పర్వదినాల్లో బంగారం దుకాణాల్లో భారీగా వ్యాపారం జరుగుతుంది. ఆ క్రమంలో నగరంలోని కార్పొరేట్ దుకాణాలు గడిచిన 15 రోజులుగా వినియోగదారులను ఆకర్షించే రీతిలో ప్రకటనలు గుప్పించాయి.

కిటకిటలాడుతున్న ప్రధాన కూడళ్లు



భవానీపురంలో టపాసుల దుకాణం వద్ద కొనుగోలుదారుల రద్దీ

దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని నగరంలోని ప్రధాన కూడళ్లు సైతం కిటకిటలాడుతున్నాయి. నగరంలో బుధవారం ఉదయం నుంచి ప్రజల రాకపోకలు భారీగా పెరగటంతో ట్రాఫిక్ సమస్యలు సైతం తలెత్తాయి. పూజ సామాగ్రితో పాటుగా పండుగ వేళ పూజకు అవసరమైన పళ్లు, పువ్వులు, ఇతర ప్రమిదలు వంటి వస్తువుల విక్రయాలతో ఆయా కూడళ్లన్నీ సందడిగా మారాయి. అలాగే మిఠాయి దుకాణాలు సైతం రద్దీగా దర్శనమిచ్చాయి.

దీంతో మంగళ, బుధవారాలు ఆయా దుకాణాలన్నీ వినియోగదారులతో కళకళలాడుతూ కనిపించాయి. రాష్ట్రంలోనే విజయవాడ నగరం బంగారం వ్యాపారానికి కేంద్రంగా ఉంది. ఆ క్రమంలో ధనత్రయోదశి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం సైతం వ్యాపార లావాదేవీలు జరిగినట్లు వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. అయితే ఆశించిన వ్యాపారం జరగలేదని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి.

మోతమోగుతున్న బాణసంచా ధరలు...

దీపావళి సందర్భంగా బాణసంచా ధరలు మోతమోగుతున్నాయి. గతంతో పోల్చుకుంటే కనీసం 15 నుంచి 20 శాతం వరకూ ధరలు పెరిగాయి. నగరంలో వివిధ ప్రాంతాల్లో బాణాసంచా విక్రయాలకు అనుమతించారు. విద్యాధరపురం లేబర్‌కాలనీ స్థలం, సింగ్‌నగర్ మాకినేని స్టేడియం, లబ్బీపేట వజ్రగ్రౌండ్స్‌లో అధికారికంగా అనుమతించారు. దీంతో పాటుగా అనేక ప్రాంతాల్లో అనధికారికంగా విక్రయాలు నిర్వహించేందుకు అధికారులు అనుమతించారు. విక్రయాలు భారీగా లేకున్నా మొత్తం మీద జరుగుతున్నాయి. బుధవారం సాయంత్రం ఒక్కసారిగా వర్షం ప్రారంభం కావటంతో వ్యాపారుల గుండెల్లో దడ ప్రారంభమైంది.

దేదీప్యం దీపాకృతులు

- ఆకట్టుకుంటున్న విభిన్న ప్రమిదలు
- పలు రకాల ప్రమిదలను విక్రయిస్తున్న తమిళ తంబిలు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):పాతబస్తీ మార్కెట్‌లో వివిధ ఆకృతుల్లో లభిస్తున్న ప్రమిదలు ఆకట్టుకుంటున్నాయి. దీపావళి పర్వదినం రోజున దీపాలు వెలిగించటం చాలా ముఖ్యమైన కార్యక్రమం. దీపావళి అంటేనే దీపాల వరస అని పేర్కొంటారు. అటువంటి పండుగ రోజున వెలిగించే దీపాలకు ప్రత్యేకంగా ప్రమిదలను విక్రయిస్తున్నారు. గతంలో మట్టి ప్రమిదలనే వినియోగించేవారు. రానురాను ప్రమిదలు సరికొత్త హంగులను అద్దుకుంటున్నాయి. పాతబస్తీలోని కాశేశ్వరరావు మార్కెట్ పరిసర ప్రాంతాల్లో వివిధ రూపాల్లో మట్టి ప్రమిదలు అలరిస్తున్నాయి.

విభిన్న ఆకృతుల్లో లభిస్తున్న ప్రమిదలు వినియోగదారులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. లక్ష్మీ గణపతి ఆకృతి, గణపతి, కలశం, శంఖు చక్రం, కొబ్బరికాయ, పాతకాలం నాటి కిరోసిన్ బుడ్డి దీపం, తులసీకోట తదితర విభిన్న ఆకృతుల్లో ఈ ప్రమిదలు కనువిందు చేస్తున్నాయి. ప్రమిదల ఆకృతిని బట్టి రూ.50 నుంచి రూ.450 వరకూ ధరలు పలుకుతున్నాయి. వీటి కొనుగోలుకు వినియోగదారులు ప్రాధాన్యతమిస్తున్నారు. మరోపక్క విద్యుత్ దీపాలు ప్రత్యేక ఆకర్షణ నిలుస్తున్నాయి. ప్రధానంగా తమిళనాడుకు చెందిన పలు కుటుంబాలు దీపావళి పర్వదినానికి వారం పది రోజులకు ముందుగా నగరానికి వచ్చి చిన్నచిన్న దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. ఆయా కుటుంబాలు నగరంలోని పలు ప్రాంతాల్లో ఈ విధమైన విభిన్న ఆకృతుల్లో ప్రమిదలను విక్రయిస్తున్నారు.

ఆకట్టుకున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాల మాక్ డ్రిల్

పున్నమిఘాట్‌లో వివిధ అంశాలపై డిమానిస్ట్రేషన్



నదిలో పడిన వారిని రక్షిస్తున్న ఎస్‌డీఆర్‌ఎఫ్



రక్షణ చర్యలకు నదిలో దూసుకెళ్తున్న దృశ్యం

భవానీపురం(విజయవాడపశ్చిమ): అత్యవసర, ప్రమాదకరమైన సమయాల్లో ఆంధ్రప్రదేశ్ స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఏపీ ఎస్‌డీఆర్‌ఎఫ్) అందించే సేవలను ప్రజలకు తెలియ చేసేందుకు కృష్ణానది తీరానగల పున్నమిఘాట్‌లో బుధవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. సీహెచ్ శ్రీకాంత్ (ఐజీపీ,ఏపీఎస్‌పీ బెటాలియన్స్ అండ్ ఏపీఎస్‌డీఆర్‌ఎఫ్), బి.రాజకుమారి (డీఐజీపీ, ఏపీఎస్‌పీ బెటాలియన్స్), 6వ బెటాలియన్ కమాండెంట్ డి. వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ కమాండెంట్ ఎం.వాసుదేవరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో 6వ బెటాలియన్ ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది వాటర్ ఎంట్రీ, స్విమ్మింగ్ స్టైల్స్, రెస్క్యూ టెక్నిక్స్, బోట్ క్యాప్సర్ అండ్ రీ సైజ్, సెర్చ్ ప్యాటర్న్స్, స్కూబీ డైవింగ్ అంశాలలో డెమో చేసి కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. ప్రమాదవశాత్తు నదిలో మునిగిపోతున్నవారి ప్రాణాలను కాపాడి ఒడ్డుకు తీసుకురావడం, ఒక్కో సారి నదిలో పడిపోయిన వ్యక్తిని కాపాడేందుకు వెళ్లిన రెస్క్యూ టీమ్ సభ్యుడిని కూడా తనతోపాటు నీళ్లల్లోకి లాగేసే సమయంలో తనను తాను సేవ్ చేసుకుంటూ బాధితుడిని ఎలా రక్షించాలి? అదే విధంగా నదిలో పడవలో ప్రయాణిస్తూ పార్టీ చేసుకుంటూ అందరూ ఒక వైపుకు చేరినప్పుడు పడవ బోల్తా కొట్టి అందరూ నీళ్లల్లో పడిపోయినప్పుడు వారిని ఎలా రక్షించాలి? వరదల సమయంలో నీటి ఉధృతికి కొట్టుకుపోతున్న వ్యక్తిని ఎలా రక్షించాలి? వంటి పలు అంశాలను ప్రదర్శించి పోలీసులు, విద్యార్థుల హర్షధ్వానాలు అందుకున్నారు. నదిలో మునిగిపోతున్న వారిని రక్షించే క్రమంలో ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం ఈదుకుంటూ వెళ్లి లైఫ్ బాయ్, త్రో రోప్ వంటి పరికరాలను వారికి అందించి కాపాడటం చూపించారు. కాగా ఇటీవల విజయవాడలో సంభవించిన బుడమేరు వరదల్లో ఏపీ ఎస్‌డీఆర్‌ఎఫ్ నుంచి 12 టీములు 21 ప్రాంతాలలో బాధితులకు సేవలు అందించాయని ఆయా బృందాలకు నేతృత్వం వహించిన సీనియర్ అధికారులు తెలిపారు. అజిత్‌సింగ్‌నగర్, పరిసర ప్రాంతాల్లో ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం 260 మంది ప్రాణాలను కాపాడిందని, 15వేల మంది బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారని, అలాగే సుమారు 50 వేల మంది వరద ముంపు బాధితులకు ఫుడ్ ప్యాకెట్స్, వాటర్ అందించారని అధికారులు ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్యక్రమంలో వివిధ పాఠశాల/కళాశాలల విద్యార్థులు, ఎస్‌డీఆర్‌ఎఫ్ ట్రైనింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

అందరికీ దీపావళి శుభాకాంక్షలు

మాజీ మంత్రి వెలంపల్లి




వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):దీపావళి పండుగ శుభ సందర్భంగా మాజీ మంత్రివర్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వెలంపల్లి శ్రీనివాసరావు నగర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ కృష్ణ భగవానుడి ఆశీస్సులతో ప్రతి ఇంట ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు పేర్కొంటూ నగర ప్రజలందరికి దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు.



పటమట(విజయవాడతూర్పు):విజయవాడ నగర ప్రజలకు మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ ధ్యానచంద్ర సంయుక్తంగా బుధవారం ఓ ప్రకటనలో దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. నగర ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకొని దీపావళి పండుగను సురక్షితంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. హరిత బాణసంచా కాల్చుకోవాలని, వాతావరణ కాలుష్యాన్ని కాపాడాలని సూచించారు.

మంచు దుప్పటి



ప్రకాశం బ్యారేజీ వద్ద బుధవారం ఉదయం మంచుతో ఆహ్లాదంగా ఉన్న వాతావరణం.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

సామాజిక సేవల్లో రెడ్‌క్రాస్ అగ్రగామి



మాట్లాడుతున్న ఏకే ఫరిదా

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):సమాజంలో అత్యవసర సమయాల్లో సేవలందించే సంస్థల్లో రెడ్‌క్రాస్ అగ్రగామి సంస్థగా కొనసాగుతుందని ఆ సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సీఈవో ఏకే ఫరిదా అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల, రెడక్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో క్లైమైట్ యాక్షన్ అవగాహన కార్యక్రమం ఆ కళాశాల ఆవరణలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఏకే ఫరిదా మాట్లాడుతూ రెడ్‌క్రాస్ ఒక అంతర్జాతీయ మానవతా ఉద్యమమన్నారు. 1859 జూన్ 24న జీన్ హెన్రీ డ్యూనంట్ రెడ్‌క్రాస్‌ను స్థాపించారన్నారు. తొలి రోజుల్లో కేవలం యుద్ధాల్లో గాయపడిన సైనికులకు సేవలందించేందుకు ఈ సంస్థ పాటుపడేందన్నారు. అనంతరం కాలంలో ప్రపంచ వ్యాప్తంగా దాదాపుగా అన్ని దేశాలకు వ్యాప్తి చెందిందన్నారు. ప్రధానంగా మారుతున్న పర్యావరణ పరిస్థితులపై ప్రజలను చైతన్యవంతం చేయటానికి రెడ్‌క్రాస్ సొసైటీ పలు కార్యక్రమాలను నిర్వహిస్తుందని చెప్పారు. అందులో భాగంగా విద్యార్థులను చైతన్యవంతం చేసి తద్వారా ప్రపంచాన్ని అవగాహన పరిచే దిశగా పలు కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. తొలుత రెడ్‌క్రాస్ సొసైటీ వ్యవస్థాపకుడు జీన్ హెన్రీ డ్యూనంట్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో సొసైటీ స్టేట్ కోఆర్డినేటర్ బీవీఎస్ కుమార్, హిందూ హైస్కూల్స్ కమిటీ విద్యాసంస్థల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి తదితరులు ప్రసంగించారు. పీవోలు ఎన్.సాంబశివరావు, కల్మాబేగం, శ్రీనివాస్ తదితరులు నిర్వహించారు.

దుర్గమ్మ సన్నిధిలో మహాలక్ష్మీ యాగం



పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న ఆలయ డెప్యూటీ ఈవో రత్నరాజు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధన త్రయోదశిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో బుధవారం మహాలక్ష్మీ యాగాన్ని నిర్వహించారు. ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ఆలయం సమీపంలోని యాగశాలలో ఆలయ అర్చకులు యాగాన్ని శాస్త్రోక్తంగా జరిపించుకున్నారు. తొలుత గణపతి పూజ, కలశ స్థాపన నిర్వహించిన అర్చకులు మహాలక్ష్మీ అమ్మవారికి కలువ పూలతో అర్చన నిర్వహించారు. అనంతరం మహాలక్ష్మీ యాగాన్ని నిర్వహించగా, పలువురు ఉభయదాతలు తమ గోత్ర నామాలతో పూజలు జరిపించుకున్నారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో ఎం.రత్నరాజు పాల్గొన్నారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు ప్రత్యేక క్యూలైన్ మార్గం ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

నేటి సాయంత్రం 6 గంటల వరకే దర్శనం

దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం సాయంత్రం ఆరు గంటల వరకు అమ్మవారి దర్శనం కలుగుతుంది. గురువారం సాయంత్రం అమ్మవారికి పంచ హారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణాన్ని దీపాలతో అలంకరించిన అనంతరం మహామండపం ఏడవ అంతస్తుపై దీపావళి వేడుకలను నిర్వహిస్తారు. దీపావళి వేడుకల అనంతరం ఆలయ ద్వారాలను మూసివేస్తారు.

దర్గాలో గంధ మహోత్సవం



భవానీపురం(విజయవాడపశ్చిమ):పశ్చిమ నియోజకవర్గం 38వ డివిజన్ పరిధిలోగల సూఫీ మత గురువులు హజరత్ సయ్యద్ అలీ హుస్సేన్ షా ఖాదిరీ (రహమతులాలై) దర్గాలో బుధవారం నిర్వహించిన గంధ మహోత్సవం వైభవంగా జరిగింది. మేళతాళాలు, ఫకీర్ల భక్తి కీర్తనల నడుమ బాబావారి ఛాదర్ గంధాన్ని గుర్రంపై ఏర్పాటు చేయగా పుర వీధుల్లో అందరికీ దర్శనమిస్తూ ఊరేగింపు ముందుకు సాగింది. దర్గా ముతవల్లి షేక్ ఖాజా మొయిద్దీన్ పర్యవేక్షణలో జరిగిన ఈ గంధ మహోత్సవ కార్యక్రమంలో భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. గురువారం సాయంత్రం దర్గా వద్ద దీపారాధన కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. సూఫీ మత గురువులు అల్తాఫ్ బాబా, నజీర్ బాబా, బాజీ బాబా, హుస్సేన్ బాబా, పలువురు భక్తులు పాల్గొని బాబావారి ఆశీస్సులు అందుకున్నారు.

పాతబస్తీ విద్యాసంస్థల్లో దీపావళి సంబరాలు



దీపావళి సంబరాల్లో పొట్టిశ్రీరాములు విద్యార్థులు



లక్ష్మీపూజ నిర్వహిస్తున్న కూరపాటి విద్యార్థులు



జడకోలాటం వేస్తున్న కేబీఎన్ విద్యార్థినులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):భారతీయ సంప్రదాయాలపై అవగాహన పెంచుకోవాలని కాకరపర్తి భావనారాయణ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు అన్నారు. ఆ కళాశాల డ్రమెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలో దీపావళి సంబరాలను బుధవారం సాయంత్రం సందడిగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన జడ కోలాటం తదితర సాంస్కృతికాంశాలు ఆకట్టుకున్నాయి. కళాశాల ప్రాంగణంలో దీపాలను ఏర్పాటు చేసి టపాసులు పేల్చి సందడి చేశారు. కార్యక్రమంలో హిందూ హైస్కూల్స్ కమిటీ విద్యాసంస్థల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి, వైస్ ప్రిన్సిపాల్స్ పీఎల్ రమేష్ డాక్టర్ కే రామకృష్ణ , కన్వీనర్ వీ శైలజ తదితరులు పాల్గొన్నారు. పాతబస్తీలోని కూరపాటి చంద్రశేఖరరావు ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో దీపావళి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో దీపావళి పండుగ సంబరాలను విద్యార్థుల కోలాహలంగా జరుపుకున్నారు. తొలుత లక్ష్మీదేవికి 1008 గులాబీ పూలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులు సందడిగా దీపాలు వెలిగించి టపాసులు కాల్చి ఉల్లాసంగా ఉత్సాహంగా సందడి చేశారు. పాఠశాల సహకార్యదర్శి చంటి, ప్రిన్సిపాల్ డాక్టర్ గానుగుల యుగంధరాచార్య పాల్గొన్నారు. పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో బుధవారం దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నరకాసుర వధ కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థులు సందడి చేశారు. అనంతరం విద్యార్థినులు పలు సాంస్కృతికాంశాలను చక్కగా ప్రదర్శించి ఆకట్టుకున్నారు. అలాగే పలు పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. అదేవిధంగా విద్యార్థులు కళాశాల ప్రాంగణాన్ని రంగవల్లులతో తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ మాట్లాడారు. కోశాధికారి కె.రాఘవయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.పతంజలిశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లల దీపావళి సందడి



కాకరపువ్వొత్తులు కాలుస్తున్న ప్రత్యేక అవసరాల విద్యార్థులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురంలోని భవిత స్పెషల్ నీడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో బుధవారం నిర్వహించిన దీపావళి వేడుకల్లో సెంటర్‌లోని ప్రత్యేక అవసరాల పిల్లలు సందడి చేశారు. కాకరపువ్వొత్తులు, మతాబులు, పాము బిళ్లలు కాలుస్తూ కేరింతలు కొట్టారు. ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భవిత స్పెషల్ నీడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రిన్సిపాల్ జె.సునీత మాట్లాడుతూ తమ సెంటర్‌లో కుల, మతాలకు అతీతంగా ప్రతి పండుగను నిర్వహిస్తూ విద్యార్థుల్లో ఉత్సాహం, చైతన్యం కలిగిస్తున్నామని తెలిపారు. వయసు పెరిగినా కల్మషమెరుగని పసి హృదయంగల ప్రత్యేక అవసరాల పిల్లల మనసు తెలుసుకుని వారికి అనుకూలంగా వ్యవహరిస్తూ సాధారణ పిల్లలుగా తీర్చిదిద్దేందుకు స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ, ఆక్యుపేషన్ థెరఫీ వంటి సేవలు అందిస్తున్నామని వివరించారు. ప్రత్యేక అవసరతల పిల్లలకు సంబంధించి అనుభవం కలిగిన టీచర్స్‌తో వారికి శిక్షణ అందిస్తున్నామనిచెప్పారు. బుద్ధిమాంద్యంగల పిల్లలు ఉన్న తల్లిదండ్రులు తమ సెంటర్‌లో చేర్పిస్తే వారికి విద్యాబుద్ధులు నేర్పుతామని, అందుకు 9985951397 నంబర్‌లో సంప్రదించవచ్చని సూచించారు.